కొళందవేలు బొమ్మ

కొళందవేలు ఉన్నట్టుండి ఆదుర్దాగా లేచాడు.

కొద్ది దూరంలో ఏదో పెద్ద ఊరేగింపు వొస్తున్నది. ముందు పోలీసులతో నిండిన రెండు వ్యానులు నెమ్మదిగా వెళుతున్నాయి. ఆ వెనక కాలి నడకన కొందరు పోలీసులు లాఠీలు ఝుళిపిస్తూ జనాన్ని పేవ్‌మెంట్ల మీదికి తోలుతున్నారు.

పేవ్‌మెంట్ల మీద తొడతొక్కిడి అయింది. మగా ఆడా అందరూ సిటీ బస్సుల్లోలాగా కిక్కిరిసి నిలబడవలసి వచ్చింది. ఆ వెనక రెండు వరుసలుగా ఊరేగింపు సాగింది. అందరూ నినాదాలు చేస్తున్నారు. ఎక్కువమంది చేతులలో రకరకాల నినాదాలు వ్రాసి ఉన్న అట్టలున్నాయి. అసలే సన్నని రోడ్డు, అటూఇటూ ఖరీదైన షాపులు... రెడీమేడ్ దుస్తుల దుకాణాలు... ఫ్యాన్సీ సామానులూ, రేడియోలు, టీవీలు అమ్మే షాపులు... ఆ వీధి అంతా ఉదయం మొదలుకొని రాత్రి పది గంటలవరకు కిటకిటలాడుతూ ఉంటుంది. వాహనాలను అనుమతించని కారణంగానూ, కోట్ల రూపాయల వ్యాపారం జరిగే రోడ్డు కావడం చేతనూ ఎల్లప్పుడూ జనం భుజాలు రాసుకుంటూ నడుస్తూ వుంటారు.

ఊరేగింపు నెమ్మదిగా ముందుకు సాగిపోయింది. పేవ్‌మెంట్ల మీద పోలీసు లాఠీల భయంతో సర్దుకున్న జనం నెమ్మది నెమ్మదిగా రోడ్డుమీదికి దిగారు.

కొళందవేలు అంతసేపూ తన బొమ్మను భద్రంగా కౌగలించుకుని నిలబడ్డాడు. ఆ తర్వాత జనం రద్దీ తగ్గగానే మళ్లీ యథాప్రకారం పేవ్‌మెంటు మీద ఉపవిష్టుడై బొమ్మను అతి భద్రంగా తన ముందుంచుకున్నాడు. చుట్టుప్రక్కల పేవ్‌మెంట్ మీద అసంఖ్యాకమైన వస్తువులు దొరుకుతాయి. అరటిపళ్లు, నిమ్మకాయలు మొదలుకొని స్మగుల్డ్ వాచీలు, జల్సా వస్తువులూ, టేప్ రికార్డర్లూ, టేప్‌లూ, రేజర్లూ, బ్లేళ్లూ, విదేశీ సెంట్లు వగైరా సామాగ్రి "త్రో అవే" ఖరీదుల్లో లభిస్తాయి.

కొళందవేలు వెనకనుంచి గర్జన లాంటిది వినిపించడంతో ఉలిక్కిపడి వెనుదిరిగి చూశాడు. అదొక బనియన్లూ, లుంగీలూ వగైరాలు అమ్మే చిన్న దుకాణం... దుకాణం ఇరుకైనదేగానీ, వ్యాపారం మాత్రం గొప్పదే.

ఆ దుకాణం యజమాని నల్లగా, సిమెంటు బస్తాలాటి పొట్టతో కదలలేని వాడిలా కూర్చుని ఉండి అరుస్తున్నాడు.

"నువ్వట్టా షాపుముందు నుంచుంటే నా యాపారం ఏం గావాల? దూరంగా పో..." కొళందవేలు మర్యాదగానే కొంచెం పక్కకు జరిగి కూర్చుని తన బొమ్మను ముందుకు జరుపుకున్నాడు. పైగా ఆయన వంకచూసి చిరునవ్వు నవ్వాడు కూడా.

ఆయన "నవ్వుతావేంది?" అంటూ ఏమిటో విసుక్కుంటూ ఉండిపోయాడు.

కొళందవేలు వచ్చేపొయ్యే వారందరి వంకా ఆశగా చూస్తున్నాడు. ఎవరైనా ఒక్క క్షణం ఆగి తన బొమ్మవంక చూస్తే చాలు. పళ్లు బైటపెట్టి నవ్వుతూ వారు కొంటారనే ఆశతో మెరిసే కళ్లతో చూస్తున్నాడు.

ఒక నడి వయసు ఆమె పచ్చగా బంగారపు బొమ్మలాగున్నది. చిన్న పిల్లవాణ్ణి నడిపించుకుంటూ వెడుతూ ఆగింది. ఆ బొమ్మవంక కొన్ని క్షణాలు చూసింది.

కొళందవేలు "అమ్మణ్ణీ! చూడమ్మా! ఎంతో కష్టపడి తయారుచేసినాను. పది రోజుల పని...?" అన్నాడు ఆశగా.

ఆమె నిశితంగా చూసింది. ఆ తర్వాత ఏమనుకున్నదో ఏమో చివాలున ముందుకు కదిలిపోయింది.

కొళందవేలు నిట్టూర్చాడు. తర్వాత తన బొమ్మ వంక చూశాడు.

పది రోజుల కష్టం... ఈ పది రోజులూ మీనాక్షికి జ్వరం... మందు లేదు, మాకులేదు. ఉండేది సిటీకి మూడు కిలోమీటర్ల దూరంలో విసిరేసినట్టున్న మురికి పేటలోని చిన్న గుడిసెలో...

"మందు తెస్తా"నని కొళందవేలు అంటే మీనాక్షి నవ్వి శుభ్రమైన తమిళంలో, "ఏం ఫర్వాలేదు లేవయ్యా! మామూలు జ్వరానికే నీ మీనాక్షి చచ్చిపోదులే" అనేది. ఇంట్లో మిగిలిన కాసిని బియ్యమూ అతనికి ఉడకేసి పెట్టి చాపమీద పరిచిన బొంతమీద పడుకుని అత్యంత చాకచక్యంగా పనిచేసే అతని వ్రేళ్లనే చూస్తూ వుండేది. కొళందవేలు అలిసిపోయి కాసేపు నడుంవాలిస్తే అతని నుదురు తుడిచి వ్రేళ్లు నిమిరి సేదదీర్చేది. కొళందవేలు మళ్లీ నిట్టూర్చాడు. తాను ఉదయం అనగా సిటీ బస్సులో బయలుదేరి వచ్చాడు. ఉదయం అంతా బొమ్మ చేతిలో పట్టుకుని ధనవంతులుండే పేటల్లో తిరిగాడు.

మధ్యాహ్నం ఒంటిగంట వేళ ఒక చవకబారు హోటల్ కనిపించింది. తిని, ఇన్ని టీ నీళ్లు తాగాడు.

ఆ తర్వాత బీసెంట్ రోడ్డుమీదికి వచ్చి రెండుసార్లు అటూఇటూ చేతిలో బొమ్మతో చక్కర్లు కొట్టి ఇదుగో, ఇక్కడ స్థిరపడి పోయాడు. జనం తండోప తండాలుగా వస్తున్నారు, పోతున్నారు. షాపుల్లోనూ పేవ్‌మెంట్లమీదా ముమ్మరంగా వ్యాపారం జరుగుతున్నది. కానీ, కొళందవేలు ముందున్న కళాఖండాన్ని కాస్త నెమ్మదిగా చూసినవారే లేరు.

కొళందవేలు ఆవులించి చేతివ్రేళ్లు విరుచుకున్నాడు. నోరంతా వగరుగా అరుచిగా ఉంది. మనసంతా దూరంగా గుడిసెలో నీరసంగా పడి ఉన్న మీనాక్షి మీదే ఉంది. మీనాక్షి...

అయిదేళ్ల క్రిందట ఎలాగుండేది? బ్రహ్మదేవుడు తీరిగ్గా కూర్చుని, మనసుపెట్టి, శ్రద్ధగా చెక్కిన శిల్పంలాగుండేది. చామనచాయ అయితేనేం... కనుముక్కు తీరు మహా అందంగా ఉండేది. ఆమె నవ్వితే బుగ్గన అందంగా సుడిపడేది. ఆమె మనసెంత మంచిదని? తమవి ఇరుగుపొరుగు ఇళ్లు. మీనాక్షికి తల్లి లేదు. తండ్రి సవతి తల్లిని తెచ్చాడు. ఆమె మీనాక్షిని వేపుకుతినేది. ఆ తర్వాత ఆమె తండ్రి చెట్టు నరుకుతూ దానికిందనే పడి చనిపోయాడు. మారుటి తల్లిని పుట్టింటివారు తీసుకుపోయారు. మీనాక్షి దిక్కులేనిదై పోయింది. అప్పుడు కొళందవేలు తల్లి ఆ పిల్లను కరుణతో చేరదీసి కోడలిగా చేసుకుని కడుపులో పెట్టుకుని ఆదరించింది. తర్వాత ఎంతో కాలం గడవలేదు. కొళందవేలు తల్లి కూడా పోయింది. ఎక్కడో కోయంబత్తూరు జిల్లాలో మారుమూల ఉన్న ఆ కుగ్రామం శిథిలమై పోయింది. ఎటువారటు క్షామ బాధ తట్టుకోలేక తోచిన దిక్కుకు వెళ్లిపోయారు.

కొళందవేలు భార్యతో రైలెక్కి ఆంధ్రదేశపు నడిబొడ్డు చేరుకున్నాడు. ముందు ఊరి మధ్యగా ప్రవహించే కాలువ గట్టున చిన్న పాక అద్దెకు తీసుకుని కాపురం పెట్టాడు. తనకొచ్చిన ఒకే ఒక విద్య బొమ్మలు చేయడం... అలాఅలా కష్టపడి బ్రతుకు వెళ్లదీస్తూ వచ్చాడు. మీనాక్షికి రెండుసార్లు గర్భం నిలవలేదు. తర్వాత రోజులు మారుతూ వచ్చాయి. పట్టణం పేదవారి మీద పగబట్టినట్టు మారిపోయింది. కాలువ పక్కన గుడిసెలు కాలిపోయాయి. దూరంగా ఎక్కడో స్థలాలిచ్చామన్నారు. అవి అవసరమైన వారికి దక్కలేదు. కాలం మరీ కఠినమైపోయింది. మీనాక్షి కాలపు కాటు తిన్నదానిలా అయిపోయింది. ఆమె ముఖంలో నవ్వు సకృత్ అయిపోయింది.

కొళందవేలు మళ్లీ నిట్టూర్చాడు. ఒకామె - ఇరవై అయిదు ఉంటుందేమో వయసు - పేవ్‌మెంటు పక్కనే నిలబడి బొమ్మవంక తదేకంగా కళ్లార్పకుండా చూస్తున్నది. ఉద్యోగిని అయి ఉండాలి. చేతిలో ఒక బ్యాగ్ ఉన్నది.

కొళందవేలు ఆశగా తెల్లని పళ్లన్నీ కనబడేట్టు నవ్వుతూ మెరుస్తున్న కళ్లతో ఆమె వంక చూశాడు.

"ఖరీదెంత?" సన్నని అందమైన కంఠస్వరం...

"యాభై రూపాయలు... ఎంతో కష్టం తల్లీ ఈ పని... పది రోజులు కష్టపడితే తయారైంది. ముందు గదిలో ఉంచుకుంటే ఇల్లంతా కళకళలాడిపోతాది. డబ్బుగల తల్లివి... తీసుకో అమ్మా!"

ఆమె పెదవి విరిచింది. ఆ విరవడంలో బొమ్మపట్ల అయిష్టతకంటె, నెలాఖరు రోజుల్లో అంత డబ్బు పెట్టడమా అన్న మీమాంస, లేక చేతి సంచిలో అంత డబ్బు లేదే అన్న నిరాశ... అన్నీ ద్యోతకం అయాయి.

"నలభై అయిదుకిచ్చేస్తాను. ఎత్తుకుపో అమ్మా"

ఆమె ఆసక్తిగా ఆ బొమ్మవేపే చూస్తూ కదిలి, తర్వాత నెమ్మదిగా నడిచి వెళ్లిపోయింది. కొళందవేలు ఆశ నిరాశ కాగా పేవ్‌మెంట్ క్రిందికి ఉమ్మేసి సర్దుకు కూర్చున్నాడు! మరో నడి

వయసు వ్యక్తి ధనం వాసన వెదజల్లుతున్న భార్య వెంట నడవగా వచ్చి నిలబడి చూశాడు. తర్వాత భార్యతో బెంగాలీలోనో, గుజరాతీలోనో ఏదో అన్నాడు. ఆమె నవ్వింది. వాళ్లా వెళ్లిపోయారు. చీకటిపడింది. లైట్లు ముమ్మరంగా వెలుగులు చిమ్ముతున్నాయి. వీధివీధి అంతా పట్టపగలుకన్నా జ్వాజ్వల్యమానంగా ఉంది.

కొళందవేలు నిరాశతో అటూఇటూ కదిలాడు. గుండె బరువెక్కినట్టయింది. ఆకలో లేక మరేమిటో కారణం తెలియదు కాని, నీరస భూతం నెత్తికెక్కినట్టున్నది. కళ్లముందు నీడలు కదులుతున్నాయి. ఒక్క క్షణం కళ్లు మూసుకున్నాడు. అదుగో, అప్పుడు వినిపించింది మళ్లీ ఆ అందమైన కంఠస్వరం... అతడు ఉలిక్కిపడి కళ్లు తెరిచాడు.

"నలభై రూపాయలిస్తాను..."

కొళందవేలు లేచి నిలబడ్డాడు. ఏదో అనబోయాడు. ఆమె అతన్ని ఏమీ మాట్లాడనివ్వకుండా మళ్లీ అన్నది.

"నలభైకిస్తే తీసుకుంటాను. లేకపోతే లేదు. సరిగ్గా అంతే ఉంది డబ్బు నా దగ్గర... అసలు బేరమాడేదాన్ని కాదు. కానీ... అంతకంటే నా దగ్గర రిక్షా ఖర్చుకు తప్ప డబ్బు లేదు..." ఇంత మాట్లాడిందంటే ఆమెకు ఆ బొమ్మ ఎంతగా నచ్చిందో, అసలామె మనసులో ఎంత కళా దృష్టి, అభిజ్ఞత ఉన్నాయో కొళందవేలు అమాయకపు మనసుకు స్ఫురించి అతని కళ్లవెంట నీళ్లు తిరిగాయి. ఇరవై అయిదు రూపాయల మెటీరియల్... పది రోజుల కష్టం... ఇంట్లో అవసరం... మీనాక్షికి కనీసం ఒక సూదిమందు... తిండికి అవసరమైన కొద్దిపాటి వస్తువులు... మళ్లీ పని చెయ్యడానికి రోజులు గడవాలి కదా... కొళందవేలు కనులు తుడుచుకుని "తీసుకో అమ్మణ్ణీ" అన్నాడు ఎంతో తృప్తిగా.

ఆమె రెండు ఇరవై రూపాయల నోట్లు బ్యాగ్‌లోనుంచి తీసి అతని చేతికిచ్చి "రిక్షాదాకా తీసుకురా" అని ముందుకు నడిచింది.

కొళందవేలు అతి ప్రేమగా పసిబిడ్డను వలె జాగ్రత్తగా బొమ్మ ఎత్తి గుండెలకు హత్తుకుని ఆమె వెంట నడిచి కొద్ది గజాల దూరంలో ఆమె బేరం ఆడిన రిక్షాలో ఉంచి, ఆమె రిక్షాలో ఎక్కి కూర్చోగానే పూడుకుపోతున్న గొంతుకతో "దయగల తల్లివి చల్లగా ఉండాలి" అని గొణిగాడు.

రిక్షా సాగిపోయింది.

కొళందవేలు తేలికపడిన మనసుతో వడివడిగా అడుగులు వేశాడు. ముందు దగ్గరలో కనపడిన హోటల్లోకి వెళ్లి టీ తాగి ఇరవై రూపాయల నోటు మార్చి, చిల్లర చొక్కా జేబులో ఉంచుకుని రెండో నోటును భద్రంగా బనీను లోపలివైపు జేబులో జాగ్రత్త చేసి గబగబ నడిచాడు. బొమ్మ అమ్ముడుపోయింది. ఇష్టపడి చల్లని తల్లి కొనుక్కుపోయింది... దాన్ని జాగ్రత్తగా చూసుకుంటుంది. అప్పుడప్పుడు దాన్ని దుమ్ము దులిపి శుభ్రం చేస్తుంది. దాన్ని కొంతకాలం గడిచాక, మోజు తీరిపోయి పాత సామాన్లలో పారెయ్యదు. ఆ ఇంటికొచ్చిన వారందరూ దాన్ని

చూస్తారు. కొందరయినా మెచ్చుకుంటారు. ఎక్కడ కొన్నావని అడుగుతారు. అప్పుడామె పేవ్‌మెంట్‌మీది ఈ నిర్భాగ్య కళాకారుణ్ని గుర్తు చేసుకుంటుంది. అతడు నడుస్తున్నాడు. పొడవైన రోడ్డు... పక్కన లైట్లు మందంగా వెలుగుతున్నాయి. దూరంగా రైల్వేగేటు... దాటి మరో రెండు కిలోమీటర్లు నడిస్తే తమ గుడిసెలు...

గేటుదాటి ఫర్లాంగు దూరం నడిచేసరికే చీకట్లు చిక్కబడ్డాయి. దూరం దూరంగా తప్ప లైట్లు లేవు.

అప్పుడు కొళందవేలుకి ఎదురైనాడు ఒక భీకరాకారుడు... ఒడ్డూ పొడుగూ ఉండి ముందు ఉబ్బిన పొట్టమీద తోలుబెల్టు వీధి దీపపు కాంతికి తళతళ మెరుస్తూ ఉండగా, చేతిలో లాఠీతోపాటు రెండు మూడు రకాల పొట్లాలతో, ఎర్రగా ఉన్న కళ్లతో...

"ఏరా! ఎక్కణ్ణుంచి ఇంత రాత్రివేళ..." అని గర్జించాడు.

ఆ కంఠస్వరం చిరకాలంగా ఎండకు ఎండి, వానకు నాని తుప్పుపట్టిన ఇనుప రేకులను కదలించినట్లున్నది. పూటుగా తాగి ఉన్నాడేమో మాటలతోపాటు ముక్కులు బద్దలయ్యే వాసన వస్తున్నది.

"బొమ్మలు చేస్తుంటాను దొరా! బీసెంటు రోడ్డులో బొమ్మలమ్ముకుని వస్తుంటాను..."

కొళందవేలు గొంతు అనవసరంగా వొణికింది.

"చాల్లే కబుర్లు... దొంగ రాస్కెల్... బాస్టర్డ్... నా దగ్గరా నీ వేషాలు? సిటీ బస్సులోనా? గవర్నర్‌పేట మార్కెట్ దగ్గరా నీ ప్రాక్టీసు? ఎంత కొట్టేశావు? తియ్ జేబులో డబ్బు... వెర్రి వేషాలేస్తే లాక్కుపోయి లాకప్‌లో పడేసి తెల్లరాక గుండు గీయిస్తాను. కీళ్లు వూడగొడతాను... నీలాటి దొంగనాయాళ్ల మూలంగా జనం బతకడం కష్టమై పోతా ఉంది. ఇంకా చూస్తావేం? తియ్ జేబులో డబ్బు..."

కొళందవేలు గుండెలు దడదడలాడాయి. పెద్దపులికి ఎదురుగా నిలబడ్డట్టు నిలువునా కంపించిపోయాడు. చుట్టుపక్కల నర సంచారం లేదు.

"లేదు దొరా! నిజంగా బొమ్మ అమ్ముకొస్తున్నాను. పది రోజుల కష్టం... అమ్ముకొస్తున్నాను" గొంతులో జీర... తనెందుకిలా వొణికిపోతున్నాడు? మాట ఎందుకు ఇలా తడబడుతున్నది? గొంతు ఎండుకుపోతున్నదెందుకని?

"నీ వాలకం... నీ మాటలు... చూస్తున్నాను... చూస్తున్నాను..."

అతని గొంతు భీకరంగా తయారైంది. పొట్లాలొక చేతిలోకి, లాఠీ ఒక చేతిలోకి చేరుకున్నాయి.

కొళందవేలు వొణికిపోతూ చొక్కా జేబులో చెయ్యిపెట్టి డబ్బు తీసి "ఇంతే ఉంది... కావలిస్తే తీసుకోండి. కానీ మళ్లీ చెప్తున్నాను నేను దొంగను కాను... ఒకామె నా బొమ్మను కొన్నది..." అన్నాడు.

"ఎవరామె? ఆమె ఇల్లెక్కడ?"

"తెలీదు, రిక్షా ఎక్కి వెళ్లిపోయింది."

"అన్నీ వేషాలు... వెధవా... సర్లేపో... అదృష్టవంతుడివి. రాజారాం చేతిలోపడ్డ కేడీగాళ్లెవరూ తప్పించుకోలేదు. సరే... రానియ్... మళ్లీ నా కళ్లబడ్డావో లాక్కుపోయి లాకప్పులో వేసి కుళ్లబొడుస్తాను, గుర్తుంచుకో" భీకరాకారుడు కొళందవేలు చేతిలో డబ్బు లాక్కుని సిమెంటు బస్తాలాంటి జేబులో కుక్కుకుని తూగుతూ జోగుతూ గొణుక్కుంటూ వెళ్లిపోయాడు.

కొళందవేలు కొన్ని క్షణాలు బొమ్మలా నిలబడిపోయి తర్వాత "థూ" అని నేలమీద ఉమ్మేసి వెనుదిరిగి విసవిసా నడవడం ప్రారంభించాడు. చీకటి ఘనీభవించింది. ఆకాశంలో మబ్బులు గుమిగూడాయి. అతను చేతితో బనీను లోపలి జేబు తడువుకున్నాడు. రెండో ఇరవై రూపాయల నోటు భద్రంగానే ఉంది. కొళందవేలుకు అంత వ్యవధిలోనూ నవ్వు వచ్చింది. పిచ్చివాడిలా నవ్వుకుంటూనే ముందుకు నడిచాడు. ఎత్తయిన కట్ట ఎక్కేసరికి కింద వరసగా భూదేవి శరీరం మీది వ్రణాలలాంటి, చీకటి కుప్పలాటి గుడిసెలు కనిపించాయి. అక్కడక్కడ మినుకుమినుకుమంటూ బుడ్డి దీపాలు... బురదతో నిండిన సన్నని దారులు...

పైన మబ్బులు... ఇప్పుడో మరి కాస్సేపటిలోనో కుంభవృష్టి కురుస్తుందనిపించింది.

❄